సాక్షి
ఒడిశా
గురువారం । 7 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 5,31,696
వెండి 60 గ్రాముల 600 మిల్లీ గ్రాములు
– భువనేశ్వర్/పూరీ



నెక్కంటితో హికక దంపతుల భేటీ

కొరాపుట్ లోక్‌సభ మాజీ ఎంపీ జిన్ను, అతని సతీమణి కౌసల్య హికకలు రాష్ట్ర బీజేడీ ఉపాధ్యక్షుడు నెక్కంటితో మంగళవారం భేటీ అయ్యారు. - 8లో.



ఆశ కార్యకర్తల సేవలు మరువలేనివి

కోవిడ్ సమయంలో ఆశవర్కర్లు, గావ్ కల్యాణ్ సమితి వర్కర్లు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని పర్లాకిమిడి కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. - 8లో.

పొత్తు పొడుపు..!

- రాష్ట్రంలో బీజేడీ – బీజేపీ కూటమి సంకేతాలు
- వేర్వేరుగా అత్యవసర సమావేశాలు
- బీజేపీ నాయకులకు ఢిల్లీకి పిలుపు



పీఎం నరేంద్ర మోదీకి వీడ్కోలు చెబుతున్న సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: రాష్ట్రంలో రాజకీయ వాతావరణం రసవత్తరంగా మారుతోంది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు వచ్చిన 24 గంటల్లోనే ఇక్కడి రాజకీయ కార్యకలాపాలు సుడిగాలి రీతిలో ఊపందుకున్నాయి. ఉభయ బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీలు అగ్రశ్రేణి నాయకులు, సీనియర్ నాయకులతో ప్రధాన కార్యాలయాల్లో బుధవారం అత్యవసర సమావేశాలకు పిలుపునిచ్చాయి. ఈ పిలుపు నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు న్యూఢిల్లీకి హుటాహుటిన పయనమయ్యారు. మరోవైపు స్థానిక నవీన్ నివాస్‌లో బిజూ జనతా దళ్ అత్యవసర సమావేశానికి పిలుపునిచ్చింది. సీనియర్ నాయకులు, ప్రముఖులు ఇతరేతర కార్యకలాపాలతో రాజధాని వెలుపల ఉన్నవారు సమావేశానికి హాజరయ్యేందుకు వీలుగా తక్షణమే వెనుదిరిగి రావాలని ఆదేశించింది. ఈ హడావుడి బీజేడీ, బీజేపీ కూటమి వ్యూహాత్మక రచనకు కసరత్తుగా ఊహాగానాలు బలం పుంజుకుంటున్నాయి.

ఢిల్లీకి బీజేపీ నాయకులు

బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, కార్యదర్శులు, కోర్ కమిటీ సభ్యులు కేంద్ర నాయకత్వంతో ముఖ్యమైన సమావేశం కోసం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. రాష్ట్రంలో పార్టీ ఎన్నికల వ్యూహంపై చర్చ జరుగుతుందని మన్మోహన్ సామల్ సూచనప్రాయంగా విలేకరులతో అన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా, సీనియర్ నేత, హోం శాఖ మంత్రి అమిత్ షా, పార్టీ ఉపాధ్యక్షుడు బైజయంత్ పండా, పార్టీ ఒడిశా వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సునీల్ బన్సాల్, ఎన్నికల ఇన్‌చార్జి విజయ్ పాల్ సింగ్ తోమర్, కో–ఇన్‌చార్జ్ లతా ఉసేండి కేంద్ర నాయకత్వం సమావేశానికి హాజరు అవుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్రానికి చెందిన ఇతర సీనియర్ నాయకులు ధర్మేంద్ర ప్రధాన్, సంబిత్ పాత్ర, మానస్ మహంతి మరియు జుయెల్ ఓరమ్ కూడా ఈ సమావేశానికి హాజరవుతారని సమాచారం. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన బ్లూప్రింట్ ఈ సమావేశంలో తుది మెరుగులు దిద్దుకుంటుందని భోగట్టా.

ఖరారు అవ్వని అభ్యర్థులు

వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం భారతీయ జనతా పార్టీ మార్చి 2న విడుదల చేసిన 195 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాలో ఒడిశా నుంచి ఎవరి పేర్లు చోటు చేసుకోకపోవడం ఇక్కడ గమనార్హం. కాగా బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ఇక్కడి నవీన్ నివాస్‌లో సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాశ్ దాస్, ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రసన్న కుమార్ ఆచార్య, అనంగ ఉదయ్ సింగ్‌దేవ్, దేవీ ప్రసన్న మిశ్రా, సంజయ్ దాస్ బర్మాలతో సహా పార్టీ సీనియర్ నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రణేంద్ర ప్రతాప్ స్వంయి, టుకుని సాహు, ప్రదీప్ కుమార్ ఆమత్, సుశాంత రౌత్, అశోక్ చంద్ర పండా, ప్రఫుల్ల కుమార్ మల్లిక్, జగన్నాథ్ సరకా, మానస్ మంగరాజ్, ప్రతాప్ కేశరి దేవ్, అతున్ సబ్యసాచి నాయక్, ప్రణబ్ బల్యంత్రాయ్, అరుణ్ కుమార్ సాహు ఈ సమావేశానికి హాజరైనట్లు సమాచారం. ఇతరేతర కారణాలు, పరిస్థితులతో పట్టణం వెలుపల ఉన్న నాయకులు అంతా నగరానికి తిరిగి రావాలని ఆదేశించినట్లు తెలుస్తోంది.

సర్వత్రా ఉత్కంఠ

ముఖ్యంగా ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరే అవకాశాలున్నాయని ఇక్కడి రాజకీయ వర్గాల్లో కొంతకాలంగా ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా గతవారం రాష్ట్రంలోని బీజేపీ, బీజేడీ నాయకులు ఎన్నికలకు ముందు ఎటువంటి పొత్తు ఉండబోదని బాహాటంగా ప్రకటించారు. ఎవరి తరహాలో వారు స్వతంత్రంగా పోటీచేసి రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని దీమా వ్యక్తం చేశారు. అయితే మంగళవారం బాలాసోర్ జిల్లా చండీఖోల్ లో జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ హాజరు కావడం రాజకీయ విశ్లేషకుల ఆలోచనలకు పదును పెట్టింది. రాష్ట్రంలో ఈ రెండు పార్టీల కూటమి సాధ్యమయ్యే అవకాశం లేకపోలేదనే చర్చ బలం పుంజుకుంది. కార్యక్రమంలో భాగంగా అవినీతి, కుంభకోణాలు, కుటుంబపరమైన పాలన ఇతరేతర ఆరోపణలతో కాంగ్రెస్‌ని ఎండగట్టిన పీఎం నరేంద్ర మోదీ, రాష్ట్రంలో బిజూ జనతా దళ్ పాలనకు సారథ్యం వహిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ని తారాస్థాయిలో కొనియాడారు. అంతకు ముందు ఇటీవల ఫిబ్రవరి 3న సంబల్‌పూర్ రెమెడ్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తనకు అత్యంత ప్రియమైన మిత్రుడుగా పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో పొత్తు ఉంటుందనే ఊహాగానాలకు బలం చేకూరినట్లు అయ్యింది.

రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం: బీజేడీ

సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ, బీజేడీ పొత్తు ఉంటుందనే ఊహాగానాల మధ్య స్థానిక నవీన్ నివాస్‌లో బిజూ జనతా దళ్ సీనియర్ నేతలు సీఎం నవీన్ పట్నాయక్ అధ్యక్షతన 2 విడతల్లో బుధవారం సమావేశమయ్యారు. తొలి విడత మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మలి విడతలో సాయంత్రం 6 గంటలకు సమావేశమయ్యారు. సమావేశం అనంతరం బీజేపీతో పొత్తుపై చర్చ జరిగినట్లు బీజేడీ తెలిపింది. అయితే ఏ నిర్ణమైనా రాష్ట్ర ప్రయోజనాలకు దోహదపడే రీతిలోనే ఉంటుందని బీజేడీ సీనియర్ నేత దేబీ ప్రసాద్ మిశ్రా తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ నేతలు దేబీ ప్రసాద్ మిశ్రా, అరుణ్ కుమార్ సాహూ విలేకరులతో మాట్లాడారు. రానున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై సీఎం నవీన్ పట్నాయక్ నేతృత్వంలో సీనియర్ నేతలతో విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేడీ కట్టుబడి ఉందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటామని వివరించారు. 2036 సంవత్సరం నాటికి ఒడిశా రాష్ట్రంగా ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుంది. ఈ సమయానికి ప్రధాన మైలురాళ్లను సాధించాలని నిర్ణయించారు. అందువల్ల రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం బిజూ జనతా దళ్ ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రానికి ఏది అవసరమో, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో పార్టీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్, ఎంపీ మానస్ మంగరాజ్, సస్మిత్ పాత్రో, మంత్రులు టుకుని సాహు, అశోక్ చంద్ర పండా, రణేంద్ర ప్రతాప్ స్వంయి, అతున్ సబ్యసాచి నాయక్, స్నేహాంగిని చురియా, ఉషా దేవి, బిక్రమ కేశరి అరూఖ్, ప్రసన్న ఆచార్య, ప్రీతి రంజన్ ఘుడై, దేబీ ప్రసాద్ మిశ్రా, అరుణ్ కుమార్ సాహు, జగన్నాథ్ సరకా తదితరులు పాల్గొన్నారు.

అధిష్టానందే తుది నిర్ణయం: బీజేపీ నాయకులు

మరోవైపు భారతీయ జనతా పార్టీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి జుయల్ ఓరమ్ పొత్తు చర్చపై ప్రకటన చేశారు. ఒడిశాలో ఎన్నికలు, పొత్తు సహా పలు అంశాలపై చర్చ జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో ఒంటరిగా పోరాడాలని అధిష్టానానికి ప్రతిపాదించామన్నారు. అయితే పొత్తుపై కేంద్ర నేతలు నిర్ణయం తీసుకుంటారని న్యూఢిల్లీలో జరిగిన బీజేపీ కీలక సమావేశంలో పాల్గొన్న జుయల్ ఓరమ్ అన్నారు. బీజేపీ సమావేశానికి ఒడిశా యూనిట్ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, అధికార ప్రతినిధి సంబిత్ పాత్రో మరికొందరు ప్రముఖులు హాజరయ్యారు. సమావేశంలో హోం మంత్రి అమిత్ షా సైతం పాల్గొని రాష్ట్ర నేతలతో చర్చించారు.

సర్దుబాటు ఎలా..?

బిజూ జనతా దళ్ మరియు భారతీయ జనతా పార్టీ మధ్య ఈసారి సరికొత్త తరహాలో పొత్తు కుదిరే అవకాశాలపై చర్చ సాగుతోంది. లోక్‌సభలో భారతీయ జనతా పార్టీ, రాష్ట్ర శాసనసభలో బిజూ జనతా దళ్ ఆధిక్యత సాధించే రీతిలో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఖరారు అవుతుందని భావిస్తున్నారు. ఈ లెక్కన శాసనసభలో బీజేడీ, లోక్‌సభలో బీజేపీ సింహభాగం స్థానాల్లో పోటీ చేసేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జాతీయ స్థాయిలో నరేంద్ర మోదీ నేతృత్వంలో బీజేపీ పట్టు సాధించి, నవీన్ పట్నాయక్ నేతృత్వంలో రాష్ట్రంలో బీజేడీ పెత్తనం నిరవధికంగా కొనసాగించేందుకు కూటమి వ్యూహాత్మక చర్యలు తీసుకుంటోంది. మొత్తం మీద బీజేపీ, బీజేడీ కూటమిపై ఉత్కంఠ కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

ఈనెల 18 నుంచి నీలావడి జాతర



నీలావడి అమ్మవారు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా ప్రజల ఆరాధ్య దైవంగా పిలవబడుతూ, కొరాపుట్ జిల్లా బంధుగాం పంచాయతీలోని నీలావడి గ్రామంలో వెలసియున్న అగ్ని గంగమ్మ అమ్మవారి వార్షిక జాతర ఈనెల 18 నుండి ప్రారంభమవ్వనుంది. ప్రతీ ఏడాది ఈ అమ్మవారి జాతరను తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తుల హాజరవుతారు. అదేవిధంగా జాతర చివరి రోజున అమ్మవారిని దర్శించుకునేందుకు దాదాపు లక్ష మందికిపైగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ ఏడాది కూడా జాతరను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈనెల 17వ తేదీ సాయంత్రం అమ్మవారి పాదాల తీసుకువచ్చే కార్యక్రమంతో జాతరకు శ్రీకారం చుడతారు. తొమ్మిది రోజులు జరిగే జాతర ఈనెల 26వ తేదీతో ముగుస్తుంది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మోహనాను ఎన్‌ఏసీ ప్రకటించాలి



ఎన్‌ఏసీగా ప్రకటించాలని ఏర్పాటు చేసిన బ్యానర్లు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో మోహనా నియోజకవర్గంలోని మోహనా బ్లాక్‌ను ఎన్‌ఏసీగా ప్రటించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం పాదయాత్ర నిర్వహించారు. ఇటీవల ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం 50 సమితిలను ఎన్‌ఏసీలుగా ప్రకటించింది. అయితే వాటిలో మోహనా బ్లాక్ లేకపోవడంతో ఆందోళన చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఆశా కుమారి



ఆశ కుమారి దాస్

బరంపురం: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గంజాం జిల్లా బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఆశా కుమారి దాస్‌ని పార్టీ అధిష్టానం బుధవారం నియమించింది. ఈవిడ బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా గతంలో విధులు నిర్వహించిన శిబ శంకర్ దాస్ సతీమణి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంజాం జిల్లాలో బీజేపీ పటిష్ఠతకు కృషి చేస్తానని తెలియజేశారు. తనకు బాధ్యతలు ఇచ్చిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈస్ట్‌కోస్టు ఏజీఎంగా మహేష్ కుమార్



మహేష్ కుమార్ బెహరా

భువనేశ్వర్: ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ ఇంజినీర్స్ (ఐఆర్ఎస్ఈ) అధికారి మహేష్ కుమార్ బెహరా ఈస్ట్ కోస్ట్ రైల్వే (ఈకోర్) అదనపు జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు అతను తూర్పు కోస్తా రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయం భువనేశ్వర్‌లో చీఫ్ ప్లానింగ్, డిజైన్ ఇంజినీర్‌గా పని చేశారు. మహేష్ కుమార్ బెహరా బుర్లా, సంబల్‌పూర్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో పట్టభద్రులయ్యారు. మద్రాస్ ఐఐటీ నుంచి ఓషన్ ఇంజినీరింగ్‌లో ఎంటెక్ పూర్తి చేశారు. 1991లో భారతీయ రైల్వే సేవా రంగంలో అడుగిడారు. లోగడ తూర్పు కోస్తా రైల్వేలో చీఫ్ బ్రిడ్జ్ ఇంజినీర్, చీఫ్ ఇంజినీర్ (బ్రిడ్జి రిహాబిలిటేషన్), భువనేశ్వర్ రైట్స్ సంస్థలో గ్రూప్ జనరల్ మేనేజర్, తూర్పు మధ్య రైల్వే పాట్నా, ముంగేర్ ప్రాంతాల్లో గంగా వంతెన నిర్మాణం చీఫ్ ఇంజినీర్ వంటి వివిధ హోదాల్లో బాధ్యతలు విజయవంతంగా నిర్వహించారు.

నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న సమితి సభ్యులు

జయపురం: స్థానిక భగవతి మందిర కల్యాణ మండపంలో కొరాపుట్ జిల్లా నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘ సమన్వయ సమితి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. రాష్ట్ర సంఘ ఉపాధ్యక్షుడు శశిభూషణ దాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం 35 మంది సభ్యులలో అధ్యక్షుడిగా శశిభూషణ దాస్, కార్యదర్శిగా మహేష్ మిశ్రాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర నాయకుల సమక్షంలో వారు బాధ్యతలు చేపడుతూ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు ప్రసన్న కుమార్ త్రిపాఠీ, అధ్యక్షుడు నారాయణ దాస్, సాధారణ కార్యదర్శి రవీంద్రనాథ్ ప్రధాన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ పండ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వేసవి తాపం



- గజపతిలో అత్యధికంగా 38 డిగ్రీల సెల్సియస్ నమోదు

భువనేశ్వర్: రాష్ట్రంలో బుధవారం పగటి పూట అత్యధిక వేడి వాతావరణం నెలకొంది. 11 చోట్ల 36 డిగ్రీల సెల్సియస్ పైబడి ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రస్థాయిలో గజపతి ప్రాంతంలో అత్యధికంగా 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డు అయినట్లు స్థానిక వాతావరణ కేంద్రం తెలియజేసింది. తదుపరి స్థానాల్లో 36.9 డిగ్రీల సెల్సియస్‌తో బొలంగీర్, 36.8 డిగ్రీల సెల్సియస్‌తో ఝూర్సుగుడ, 36.7 డిగ్రీల సెల్సియస్‌తో మల్కన్‌గిరి, 36.5 డిగ్రీల సెల్సియస్‌తో టిట్లాగడ్ ప్రాంతాలు అత్యధిక వేడి ప్రాంతాలుగా నిలిచాయి.

ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
పర్లాకిమిడి	38.0
బొలంగీర్	36.9
ఝూర్సుగుడ	36.8
మల్కన్‌గిరి	36.7
టిట్లాగడ్	36.5
సోన్‌పూర్	36.2
భవానీపట్న	36.2
రాయగడ	36.2
తాల్చేరు	36.0
నయాగడ్	36.0
బౌధ్	36.0
అంగుల్	35.7
సంబల్‌పూర్	35.7
ఢెంకనాల్	35.5
నవరంగపూర్	35.0
జగత్‌సింగ్‌పూర్	35.0
సుందరగడ్	35.0

బీజేడీలోకి చేరికలు



పార్టీలో చేరినవారితో నెక్కంటి తదితర నాయకులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి అధ్యక్షుడు కొంతొమార్ఝి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు బీజేడీలో బుధవారం చేరారు. స్థానిక రాణిగుడఫారంలో బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు సమక్షంలో వీరంతా బీజేడీ కండువాలు కప్పుకున్నారు. గత రెండు రోజులుగా బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి వందలాది మంది బీజేడీలో చేరుతుండడంతో పార్టీ మరింత బలోపేతమవుతోందని నెక్కంటి పేర్కొన్నారు. మరికొద్ది రోజుల్లో కాంగ్రెస్ పూర్తిగా కనుమరుగు అవుతుందని ఎద్దేవా చేశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని బిస్సంకటక్, రాయగడ, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గాలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానం సైతం గెలుస్తామని దీమా వ్యక్తం చేశారు.

విశాఖకు వందే భారత్ సేవలు

తూర్పు కోస్తా రైల్వే జోన్ పరిధిలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు అంచెలంచెలుగా విస్తరిస్తున్నాయి. అతి త్వరలో భువనేశ్వర్, విశాఖపట్నం మధ్య అత్యంత ఆధునిక సౌకర్యాలతో శరవేగంగా దూసుకుపోయే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పట్టా లెక్కనుంది.
– భువనేశ్వర్



అభివృద్ధి పథంలో రాయగడ

- కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్

రాయగడ: వివిధ రంగాల్లో రాయగడ జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తోందని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి అధ్యక్షతన సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. జిల్లాలోని అమో ఆస్పత్రి, మిల్లెట్ మిషన్, భూమి సన్మాన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలు ఎన్నో సౌకర్యాలను పొందగలుగుతున్నారన్నారు. అదేవిధంగా విద్యా రంగంలో జిల్లా ప్రగతి సాధిస్తోందని తెలియజేశారు. జిల్లాలోని 214 పాఠశాలలు, మరో 34 కళాశాలలను 5టీ పథకంలో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా స్థానిక బాకురుగుడలో సుమారు రూ.14 కోట్లతో ఏర్పాటు చేసిన ప్లానిటోరియం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చిందని తెలియజేశారు. క్రీడారంగంలో భాగంగా రెండు ఇన్‌డోర్ స్టేడియాల నిర్మాణాలు పూర్తయ్యాయని వెల్లడించారు.

వైద్యుల కొరతపై చర్యలు

జిల్లాలోని వైద్యరంగం మాత్రం మరింత అభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. వైద్యుల కొరత కారణంగా రోగులు సకాలంలో సరైన వైద్య సౌకర్యాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో 462 మంది వైద్యుల అవసరం ఉండగా, ఇందులో కేవలం 262 మంది వైద్యులను మాత్రమే ప్రభుత్వం నియమించిందన్నారు. మిగతా ఖాళీలను భర్తీ చేయగలిగితే ప్రజలు మెరుగైన వైద్య సౌకర్యాలు పొందే అవకాశం ఉందన్నారు.

తాగునీటి సమస్య అంతంతమాత్రమే

జిల్లాలో తాగునీటి సమస్య అంతంతమాత్రంగానే ఉందని సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు అన్నారు. రానున్న వేసవి కాలంలో సమస్యను పరిష్కరించేవిధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఏడాది 2023–24 ఆర్థిక సంవత్సరానికిగాను 2,35,644 ఇళ్లకు శుద్ధమైన తాగునీటిని అందించాలన్న లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటికే 1,75,085 గృహాలకు తాగునీరు అందించగలిగామని జిల్లా నీటి సరఫరా విభాగ అధికారి తెలియజేశారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రాదేవి, వివిధ శాఖల అధికారులు, జిల్లా పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

క్లుప్తంగా

హోంగార్డుకు రూ.4.22 లక్షల చెక్ అందజేత



అప్పారావుకు చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు శాఖలో హోం గార్డుగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కొవ్వూరు అప్పారావుకు ఎస్పీ జి.ఆర్.రాధిక రూ.4.22 లక్షల చెక్కును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. అప్పారావు కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తున్న హోంగార్డుల ఒక్కరోజు వేతనాన్ని చెక్కు రూపంలో అందించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం మాఘ బహుళ ఏకాదశి సందర్భంగా బుధవారం ఉదయం ఘనంగా జరిగింది. ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణమూర్తులుగా అనివేటి మండపంలో కొలువుదీర్చారు. అనంతరం ఆగమశాస్త్ర ప్రకారం ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ కల్యాణం జరిపించారు. కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేషవస్త్రాలు, తలంబ్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

శ్రీముఖలింగం ఆలయ పాలక మండలి ఏర్పాటు



బి.వి.రమణ

జలుమూరు: ప్రసిద్ధ శైవ క్షేత్రం శ్రీముఖలింగం ఆలయానికి పాలక మండలిని ఏర్పాటు చేస్తూ దేవదాయ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు బుధవారం తెలిపారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ నియామకానికి కూడా ఆదేశాలు వచ్చాయని పేర్కొన్నారు. శ్రీముఖలింగం ఆలయ చైర్మన్‌గా బి.వి.రమణ, సభ్యులుగా ఎస్.కృష్ణవేణి, వై.బాలమ్మ, కె.పండా, జి.సరోజిని, జె.గోపి, ఎన్.స్వాతి, వి.సంతోషి, ఎల్.రమేష్ గుప్తా, బి.వి.సుబ్బారావులను నియమించారు. శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కమిటీ సభ్యులుగా అరుణ్‌కుమార్ దాస్, పి.అప్పలనాయుడు, ఎల్.రామయ్య, వి.పరమేశ్వరి, టి.భాగ్యం, ఎస్.దేవి, ఎన్.ఉగాది, విశ్వనాథ్‌దాస్ నియమితులయ్యారు. తనను పలక మండలి చైర్మన్‌గా ఎంపికకు కృషి చేసినందుకు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, బీసీ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య, వైఎస్సార్ సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మ ప్రియమ్మ, ఎంపీపీ వాన గోపి తదితరులకు బసవ వెంకట రమణ కృతజ్ఞతలు తెలిపారు.

ఎఫ్‌సీఐకి లెవీ బియ్యం చెల్లించాలి



మాట్లాడుతున్న అధికారులు

నరసన్నపేట: జిల్లాలో మిల్లర్లు ఎఫ్‌సీఐకి లెవీ బియ్యాన్ని నెలాఖరులోగా చెల్లించాలని సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ కె.శ్రీనివాస్ ఆదేశించారు. నరసన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో మిల్లర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మిల్లర్ల నుంచి 40 వేలు మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. జేసీ నవీన్ ఆదేశాల మేరకు మిల్లర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మిల్లర్లు సహకరించాలని కోరారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఏఓగా బాబూరావు

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయ పరిపాలనాధికారిగా ఆర్.బాబూరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన స్థానిక రిమ్స్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఏఓగా పదోన్నతితో ఇక్కడ విధుల్లోకి చేరారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ బి.మీనాక్షిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇక్కడ అకౌంట్స్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శివకుమార్‌కు పరిపాలన (అడ్మిన్) విభాగ సూపరింటెండెంట్‌గా కూడా బాధ్యతలు అప్పగించినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. ఇక్కడ అడ్మిన్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన భాస్కర్‌కుమార్ ఇటీవలే వివిధ ఆరోపణల కారణంగా విధుల నుంచి సస్పెండ్ అయిన సంగతి విదితమే. ఇందుకు కారణమైన హెల్త్ అసిస్టెంట్ల నియామకాలకు సంబంధించి ఆరోపణలపై వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ కార్యాలయ ఉన్నతాధికారులతో విచారణ కొనసాగుతోంది.

నెక్కంటితో హికక దంపతుల భేటీ

- కొరాపుట్ లోక్‌సభ స్థానంపై ఉత్కంఠ



నెక్కంటితో మాట్లాడుతున్న జిన్ను, కౌసల్య హికకలు

రాయగడ: కొరాపుట్ లోక్‌సభ మాజీ ఎంపీ జిన్ను, అతని సతీమణి కౌసల్య హికకలు రాష్ట్ర బీజేడీ ఉపాధ్యక్షుడు నెక్కంటితో మంగళవారం భేటీ అయ్యారు. రాణిగుడఫారంలోని ఆయన స్వగృహంలో సాయంత్రం సుమారు మూడు గంటల పాటు నెక్కంటితో మంతనాలు జరిపారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి బీజేడీ టిక్కెట్టుపై పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్న కౌసల్య హికక, జిన్నులు నెక్కంటితో భేటీ అవ్వడం చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి బీజేడీ టిక్కెట్టుపై పోటీ చేసిన కౌసల్య హికక కేవలం 3,613 ఓట్లతో పరాజయం పాలయ్యారు. అయితే ఓటమి చవిచూసినా పట్టువిడవకుండా పార్టీలో జరుగుతున్న వివిధ కార్యకలాపాల్లో అప్పటి నుంచి చురుగ్గా పాల్గొంటున్నారు. ఆమె భర్త జిన్ను హికక కొరాపుట్ బీజేడీ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె మరోసారి కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అయితే ఇదే స్థానం నుంచి ఈసారి బీజేడీ టిక్కెట్టుపై బరిలో దిగేందుకు ప్రయత్నిస్తున్న ఎస్‌డీసీ చైర్‌పర్సన్ అనసూయ మాఝి కూడా తన రాజకీయ పావులను కదుపుతున్నారు. దీంతో వీరిద్దరిలో ఎవరికి టిక్కెట్టు లభిస్తుందోనని కార్యకర్తలు, సామాన్య ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

నెక్కంటి పాత్ర కీలకం

ఇదిలా ఉండగా కొరాపుట్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసేందుకు బీజేడీ టిక్కెట్టు దక్కాలంటే అందుకు నెక్కంటి పాత్ర చాలా కీలకం. రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన నెక్కంటి అవిభక్త కొరాపుట్ జిల్లాలో పార్టీ విజయానికి ఎన్నో సేవలు అందించారు. యాభై ఏళ్ల రాజకీయ జీవితంలో బీజేడీకి చేసిన సేవలను గుర్తించిన అధిష్ఠానం అందుకు అనుగుణంగా ఆయనకు ప్రాధాన్యతను ఇస్తుంది. ఈ నేపథ్యంలో టిక్కెట్టు దక్కించుకోవాలంటే అందుకు నెక్కంటి ఆశీర్వాదం అవసరంగా భావించిన ఆశావాదులు, ఆయన ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. కొద్దిరోజుల క్రితం ప్రత్యేక అభివృద్ధి మండలి రాష్ట్ర శాఖ ముఖ్యసలహాదారుడును వెంటపెట్టుకుని రాయగడ ఎస్‌డీసీ చైర్మన్ అనసూయా మాఝి నెక్కంటి ఇంటికి వెళ్లారు. ఎప్పుడు రాయగడకు వచ్చినా ఒక్కసారి కూడా నెక్కంటిని ప్రత్యేకంగా కలవని ప్రదీప్ ఈసారి అనసూయను వెంటపెట్టుకుని కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

హికకతో సత్సంబంధాలు

2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కొరాపుట్ నుంచి గెలిపొందిన జిన్ను హికకతో నెక్కంటికి మంచి సంబంధాలు ఉన్నాయి. అప్పటి నుంచి జిన్ను నెక్కంటి వద్ద పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలకు సంబంధించి సలహాలు తీసుకుంటుండేవారు. ఈ నేపథ్యంలో ఈసారి జిన్ను భార్య కౌసల్యకు టిక్కెట్టు కేటాయించే విషయంలో నెక్కంటి ఎంతవరకు సహకరిస్తారో చూడాల్సిందే.

గ్రామాల్లో విద్యార్థుల పర్యటన



నువాగాం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల వద్ద వర్సిటీ బృందం



గ్రామస్తులతో ముచ్చటిస్తున్న విద్యార్థులు

జయపురం: స్థానిక విక్రమదేవ్ వర్సిటీ బీఈడీ విద్యార్థులు ఫీల్డ్ విజిట్‌లో భాగంగా పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ముందుగా బొరిగుమ్మ వెళ్లి అక్కడ నుంచి నువాగాం గ్రామానికి వెళ్లారు. ఆ గ్రామంలో ప్రభుత్వ ఎస్ఎస్‌డీ బాలికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో ముచ్చటించారు. చదువు వలన కలిగే ప్రయోజనాలు, గ్రామ పచ్ఛదనం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లపై అవగాహన కల్పించారు. పిల్లల మనో వికాసానికి విద్య ఎంతో అవసరమన్నారు. వర్సిటీ ఫ్యాకల్టీ డా.బలభద్ర జెన, డా.నరేంద్ర కుమార్ మహరాణ, శివ ప్రసాద్, సుజాత బెజల ఆధ్వర్యంలో గ్రామాల ఆర్థిక, సామాజిక విషయాలపై సర్వే నిర్వహించారు. అనంతరం నకులగుడ, మఝిగుడ గ్రామాలను, చంపాపాదర్ పార్కును సందర్శించారు.

జయనగర్ రహదారి మూసివేత

జయపురం: స్థానిక పంచానన మందిరం కూడలి నుంచి జయనగర్ వరకు ఉన్నటువంటి రోడ్డును జయపురం మున్సిపల్ అధికారులు మూసివేశారు. జయనగర్ వెళ్లాల్సిన వారు మరోమార్గంలో వెళ్లాలని మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్ సూచించారు. చారిత్రాత్మక జగన్నాథ్ సాగర్ అభివృద్ధి పనులు సజావుగా పూర్తి చేసేందుకు సాగర్ నీరు విడిచిపెట్టడం తప్పనిసరి అన్నారు. అందువలన పంచానన మందిర కూడలి నుంచి జయనగర్ రోడ్డు తవ్వి నీరు విడిచిపెట్టాల్సి వస్తోందని వెల్లడించారు. వారం రోజులు నీరు విడిచిపెట్టిన అనంతరం రోడ్డు మరమ్మతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాగర్ సుందరీకరణకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విజిలెన్స్ వలలో రెవెన్యూ అధికారి



పట్టుబడిన ప్రమోద్ కుమార్ బెహరా

బరంపురం: విజిలెన్స్ వలకు మరో అవినీతి చేప చిక్కింది. గంజాం జిల్లా జగన్నాథ్ ప్రసాద్ బ్లాక్‌లో రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ప్రమోద్ కుమార్ బెహరా లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. బరంపురం విజిలెన్స్ ఎస్పీ మాయాధర్ స్వాంయి తెలిపిన వివరాల మేరకు.. జగన్నాథ్ ప్రసాద్ బ్లాక్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్రమోద్ కుమార్ బెహరా ఒక వ్యక్తికి ఇంటి పట్టా మంజూరు చేసేందుకు రూ.5 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు బరంపురం విజిలెన్స్ అధికారులను ఆశ్రయించాడు. బరంపురం విజిలెన్స్ ఎస్పీ ఆదేశాలతో డీఎస్పీ సంతును కుమార్ మహాపాత్రో ఆధ్వర్యంలో విజిలెన్స్ బృందం పథకం పన్ని లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అన్ని అధారాలు సేకరించి ప్రమోద్ కుమార్‌ను కోర్టుకి తరలించినట్లు వెల్లడించారు.

మల్లన్న ఆదాయం రూ.1,32,847

టెక్కలి: మండలంలోని రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం హుండీ కానుకల ఆదాయం లెక్కించారు. 85 రోజులకు గాను రూ.1,32,847 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సర్లాన సుధాకర్ ఈఓలు వి.రాధాకృష్ణ, టి.మనస్వి, భక్తులు పాల్గొన్నారు.

మహిళా క్లబ్ ఆధ్వర్యంలో పోటీలు



ర్యాంప్ వాక్‌లో పాల్గొన్న మహిళలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ రంజిత

రాయగడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మహిళా క్లబ్, లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో మహిళల మధ్య వివిధ పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యావేత్త డాక్టర్ రంజితా పాడి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మహిళలు నిరక్ష్యరాస్యత కారణంగా వెనుకడి ఉన్నారన్నారు. అటువంటి వారికి ఇటువంటి తరహా క్లబ్‌ల సహకారంతో చైతన్యవంతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మహిళల మధ్య ర్యాంప్ వాక్, మ్యూజికల్ చైర్, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు.

• ముగిసిన వైబ్రెంట్ విస్టా





ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఇంజినీరింగ్ కాలేజ్‌లో రెండు రోజులుగా నిర్వహించిన వైబ్రెంట్ విస్టా 2కే24 టెక్నికల్ ఫెస్ట్ బుధవారంతో ముగిసింది. విద్యార్థులు వర్సిటీ ప్రధాన ద్వారం ముందు ప్రదర్శించిన ఫ్లాష్ మాబ్ నృత్యం ఆకట్టుకుంది. అనంతరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని, ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు. – ఎచ్చెర్ల క్యాంపస్

ఆశ కార్యకర్తల సేవలు మరువలేనివి



సమ్మేళనంలో పాల్గొన్న అధికారులు, నాయకులు



అవార్డు అందుకుంటున్న రాయఘడ బ్లాక్ సురదా ఆశ కార్యకర్త



రివార్డు అందుకుంటున్న మోహనా ఆశ కార్యకర్త



మాట్లాడుతున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్

పర్లాకిమిడి: కోవిడ్ సమయంలో ఆశవర్కర్లు, గావ్ కల్యాణ్ సమితి వర్కర్లు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ అన్నారు. స్థానిక ఆశీర్వాద్ కన్వెన్షన్ సెంటర్‌లో జిల్లా స్థాయి ఆశా వర్కర్లు, గావ్ కల్యాణ్ సమతి (జీకేఎస్), మహిళా ఆరోగ్య సమితి వర్కర్ల (మాస్) ప్రథమ వార్షిక సమ్మేళనాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మండల స్థాయిలో ఆర్.ఉదయగిరి, గుసాని, రాయఘడ, సువాగడ, కాశీనగర్, మోహనా, పర్లాకిమిడి కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశవర్కర్లు, జీకేఎస్, మహిళా ఆరోగ్య సమితి కార్యకర్తలకు అవార్డులు, రివార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ పీకే పాత్రో అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, డీపీహెచ్‌వో డాక్టర్ మహ్మద్ ముబారక్ అలీ, డీపీఎం సౌమ్యరాణి గౌడో, ఎస్ఐ నేత్రానంద శతపతి పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలపై దాడులు



నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు



చికిటిలో స్వాధీనం చేసుకున్న తయారీ సామగ్రి

బరంపురం: జిల్లా పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న రెండు నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఐఐసీ అధికారి అర్జున్ కుమార్ మాలిక్ తెలిపిన వివరాల మేరకు.. దిగపండి పోలీసుస్టేషన్ పరిధిలో కుమ్మజరి గ్రామ శివారు మొగలి పొదల్లో అక్రమంగా తయారు తయారు చేస్తున్న నాటుసారా బట్టీలపై బరంపురం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. అదేవిధంగా కె.నువాగం పోలీసుస్టేషన్ పరిధి చికిటి పెంట శివారులో నాటుసారా బట్టీపై సైతం దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా సుమారు 3,600 లీటర్ల నాటుసారా ధ్వంసం చేయడంతో పాటు తయారీ సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లాకు తృతీయ స్థానం



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు, జిల్లా కార్యదర్శి సాధు శ్రీను

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. విశాఖపట్నం ఏయూ ఇంజినీరింగ్ క్రీడామైదానం వేదికగా ఈ నెల 3 నుంచి 5 వరకు 70వ ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఇందులో శ్రీకాకుళం పురుషుల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. నిర్వాహకులు, రాష్ట్ర కబడ్డీ సంఘ ప్రతినిధుల చేతుల మీదుగా జిల్లా క్రీడాకారులు ట్రోఫీ, పతకాలను అందుకున్నారు. అత్యద్భుత ఆటతీరుతో రాణించిన జిల్లా క్రీడాకారులు ఎస్.శంగలరావు (సింగుపురం-శ్రీకాకుళం రూరల్), ఎం.మణికంత (పాలకొండ) జాతీయ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీలు మహారాష్ట్రలో మార్చి మూడో వారంలో జరగనున్నాయి. వీరిని జిల్లా కబడ్డీ జట్టు రాణింపు పట్ల జిల్లా కబడ్డీ, బీచ్ కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సీదిరి అప్పలరాజు, అధ్యక్షుడు ధర్మాన రామలింగంనాయుడు, కార్యదర్శి సాదు శ్రీనివాసరావు, ఒలింపిక్ సంఘ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎం.వి.రమణ, పోలినాయుడు, డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్‌రావు అభినందించారు.

లారీ ఢీకొని ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ మృతి



ఘటనా స్థలంలో ముకుందరావు మృతదేహం

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని వంజంగి-వాకలవలస రహదారిలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ చింతాడ ముకుందరావు (57) మృతి చెందారు. ఈయన ఎచ్చెర్ల మండలం కుశాలపురంలో నివాసముంటున్నారు. ఆమదాలవలసలో విధులు ముగించుకుని శ్రీకాకుళం వస్తుండగా ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి మరో లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ముకుందరావుకు భార్య ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

పార్వతీపురం టౌన్: పాలిసెట్‌కు పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వి లియం క్యారీ తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ – రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణా మండలి రూపొందించిన 'పాలిటెక్నిక్ చదవటం ఉత్తమం, ఎందువలన అంటే' పోస్టర్‌ను ఎమ్మార్‌నగరం పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి లోచర్ల రమేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణత తరువాత సాంకేతిక విద్యను అభ్యసించడం సులువైన, తెలివైన మార్గం అన్నారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు గణనీయంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. పాలిసెట్ ద్వారా అడ్మిట్ అయిన అర్హులైన అందరికి ఫీజు రీయంబర్స్ మెంట్, వసతి సౌకర్యాలు, ఉపకార వేతనాలు సదుపాయం ఉంటుందన్నారు. ఏఐసీటీఈ మార్గదర్శకంతో ఆధునిక టెక్నాలజీలకు అనుగుణంగా ఇండస్ట్రీ 4.0 కోర్సుల రూపకల్పన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె వెంకట ఉజ్వల్, ఈసీఈ విభాగాధిపతి జి.ఉదయ భాస్కర్, అధ్యాపకులు పి.అనురాధ, మండల ఉపాధ్యక్షులు బి.రవికుమార్, సర్పంచ్ వి.త్రినాథ రావు, అమ్మ యూత్ క్లబ్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జె.కె.గుమ్మడలో జీడి, మామిడి తోటలు దగ్ధం



జీడి, మామిడి తోటలో చెలరేగిన మంటలు

వంగర: మండల పరిధి వి.వి.ఆర్.పేట పంచాయతీ జె.కె.గుమ్మడలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామ సమీపంలోని దాలినాయుడు తోట వద్ద 12 మంది రైతులకు చెందిన 10 ఎకరాల జీడి, మామిడి తోటలు దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో జక్కు గణపతి, అల్లారపు తిరుపతి, డొంకాడ రమణ మ్మ, కొల్లి శివున్నాయుడు, మరిశర్ల సత్యంనాయుడుతో పాటు మరి కొంతమంది రైతులకు చెందిన తోటలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని దుండగులు నిప్పంటించి ఈ ఘటనకు పాల్పడ్డారని రైతులు చెబుతున్నారు. దీనిపై వంగర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆరా తీస్తున్నారు. గ్రామస్తులందరూ సమిష్టిగా మంటలను అదుపు చేశారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

బొబ్బిలి: భార్యపై అనుమానంతో ఇనుప రాడ్‌తో విచక్షణారహితంగా తలపై భర్త మోదడంతో ఆస్పత్రిలో చేరి అనంతరం మరణించింది. సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపిన వివరాలు.. మండలంలోని కమ్మవలసకు చెందిన పాతినవలస తవిటినాయుడు, లక్ష్మిలకు జ్యోతిప్రసాద్(15), యశ్వంత్(12) పిల్లలున్నారు. తరచూ భార్యపై అనుమానం వ్యక్తం చేస్తూ గొడవ పడినట్టుగానే గత నెల 20న కూడా గొడవ జరగడంతో భార్య తలపై భర్త ఇనుప రాడ్‌తో కొట్టాడు. తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిన లక్ష్మి మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపర్చారు.

వాహనం బోల్తాపడి బాలుడి మృతి

అనంతగిరి(అల్లూరి జిల్లా): మండలంలోని లంగుపర్తి గిరిజన సంక్షేమ బాలురు పాఠశాల సమీపంలోని బుధవారం బొలెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో ఎస్.కోట ప్రాంతానికి చెందిన బా లుడు మృతి చెందాడు. లంగుపర్తిలో మహాశివరా త్రి జాతర సందర్భంగా ఎస్.కోట ప్రాంతానికి చెందిన సౌండ్ సిస్టం, స్టేజ్‌ను బొలెరో వాహనంలో తీసుకువచ్చారు. పాఠశాల సమీపంలోని వాహనం అదుపుతప్పి వెనుకకు జారడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న ఎస్.కోట ప్రాంతానికి చెందిన పవన్‌కల్యాణ్(15) మృతి చెందాడు. కుటుంబ అవసర నిమిత్తం పనికి వచ్చి, మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.3.35 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి

రేగిడి: మండలంలోని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఇప్పటి వరకు 3.35లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయినట్టు అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి బుధవారం తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల రైతులు సాగుచేసిన చెరకును క్రషింగ్ చేస్తున్నట్టు వివరించారు. ప్రతిరోజు 3,200 టన్నుల చెరకు క్రషింగ్ జరుగుతోందన్నారు. గతేడాది అక్టోబర్ చివరి వారంలో క్రషింగ్ ప్రారంభించామని, ఈ ఏడాది ఏప్రిల్ నెలవరకూ క్రషింగ్ జరగనుందని తెలిపారు. 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ లక్ష్యంగా చేసుకున్నట్టు వివరించారు. రైతులకు సకాలంలో చెరకు బిల్లులు చెల్లిస్తున్నామని తెలిపారు.

చదువుల లోగిళ్లు... గిరిజన సంక్షేమ ఆశ్రమాలు



సుందరంగా హడ్డుబంగి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల

- కార్పొరేట్‌ను తలదన్నేలా చదువులు
- ఆధునీకరించిన వసతులు
- నాడు – నేడు తొలి విడతలో 47 ఆశ్రమాలకు రూ.21 కోట్లు
- రెండో విడతలో 37 ప్రాథమిక పాఠశాలలకు రూ.34 కోట్లతో వసతులు
- పెరిగిన ప్రవేశాలు



క్రమశిక్షణతో భోజనాలు చేస్తున్న బాలికలు

సీతంపేట: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గిరిజన సంక్షేమ విద్యకు పెద్దపీట వేస్తుంది. బైజూస్ కంటెంట్‌తో చదువులు ముందుకు సాగుతున్నాయి. కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుంది. మనబడి నాడు – నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ఆట, పాటలకు అనువుగా ఉండేలా ఆట స్థలాలు, పరికరాలు ఉండడం, మౌలిక వసతుల కల్పనలో భాగంగా మరుగుదొడ్లు నిర్మాణం, మినరల్ మంచినీటి సదుపాయాలు, ఆకట్టుకునే తరగతి గదులు వాటిలో ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు ఇలా ఎన్నో సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థులు పాఠశాలల్లో చేరడానికి ముందుకు వస్తున్నారు. ఒకప్పుడు తల్లిదండ్రులతో కొండపోడు వ్యవసాయాలకు తోడు వెళ్తే పిల్లలు ఇప్పుడు బడిబాట పట్టారు. ఉల్లాసంగా పాఠశాలలకు వెళ్తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో ఉంటూ చదువుతున్నారు. మూడు పూటల భోజన, వసతి, వైద్య సౌకర్యాలు వంటివి పూర్తి స్థాయిలో అందుతున్నాయి. ఈ ఏడాది ప్రవేశాలకు



సీతంపేట బాలికల ఆశ్రమపాఠశాల

మంచి డిమాండ్ ఏర్పడింది. సీతంపేట గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 2022 – 23 విద్యా సంవత్సరంలో 16,775 మంది విద్యార్థులు చదివితే 2023 – 24లో 20,,265 మంది విద్యార్థులు చదువుతున్నారు. దాదాపు 3,490 మంది విద్యార్థుల అడ్మిషన్లు పెరిగాయి. తొలి విడతలో 47 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో రూ.21 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు. రెండో విడతలో రూ.34 కోట్లతో 37 గిరిజన ప్రాథమిక పాఠశాలలు, మరో 5 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు మౌలిక



బై జూస్ ట్యాబ్‌ను వినియోగించుకుంటూ చదువుతున్న బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

వసతులు కల్పించారు. మరుగుదొడ్లు నిర్మాణంతో పాటు ప్రతీ తరగతి గదిలో విద్యుత్ సౌకర్యంతో ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్ల ఏర్పాటు, తాగునీటి కల్పన, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బందికి అవసరమైన ఫర్నిచర్, పాఠశాల భవనం, ప్రహరీలకు నాణ్యమైన పెయింటింగ్, పాఠశాలలో ప్రస్తుతం ఉన్న భవనానికి పూర్తి స్థాయి మరమ్మతులు, బ్లాక్ బోర్డుల ఏర్పాటు అదనపు గదుల నిర్మాణం వంటివి చేపట్టారు. దీంతో ఈ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారిపోయాయి.

గిరిజన విద్యకు పెద్దపీట



గత టీడీపీ ప్రభుత్వం హయాంలో కేవలం మరమ్మతులు పేరుతో రంగులు వేసి నిధులు కొల్లగొట్టారు. జగనన్న ప్రభుత్వంలో గిరిజన విద్యకు పెద్దపీట వేశారు. అన్ని పాఠశాలలకు పూర్తి మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నాం. తల్లిదండ్రులు, విద్యార్థులు ఎంతో ఆనందంగా ఉన్నారు.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

అన్ని పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు



అన్ని పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సబ్జెక్టు టీచర్లు నియమించాం. ఖాళీలున్నచోట సీఆర్‌టీలను నియమించాం. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. మంచి చదువులను అందించి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం.

– అన్నదొర, గిరిజన సంక్షేమశాఖ డీడీ

ప్రవేశాలు పెరిగాయి



గతంతో పోలిస్తే పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. మా పిల్లలకు సీట్లు ఇప్పించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు వస్తున్నారు. ఈ క్రమంలో ప్రతీ విద్యార్థికి ఆయా పాఠశాలల్లో ఖాళీలను అనుసరించి సీట్లు కేటాయిస్తున్నాం.

– ఎ.లిల్లీరాణి, డిప్యూటీ ఈఓ, సీతంపేట

జగన్ మామకు రుణపడి ఉంటాం



జగన్ మామకు రుణపడి ఉంటాం. పాఠశాలల్లో మాకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇక్కడ ఉండి చక్కగా చదువుకుంటున్నాం. బై జూస్ పాఠాలు ఎంతో అర్థవంతంగా ఉన్నాయి. రోజూ ట్యాబ్‌లు వినియోగించుకుంటున్నాం. ప్రత్యేక సెలవుల్లో తప్ప ఎప్పుడు ఇంటికి వెళ్లకుండా పాఠశాలల్లో ఉండి చదువు కొనసాగిస్తున్నాం.

– ఎస్.ఝాన్సీరాణి, 9వ తరగతి

హోటల్ రంగాన్ని పరిశ్రమ రంగంగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి

విజయనగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హోటల్ రంగాన్ని పరిశ్రమ రంగంగా గుర్తించాలని... తద్వారా వినియోగదారులకు సంతృప్తికరమైన సేవలు అందించగలమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి కోరారు. స్థానిక ఎస్‌వీఎన్ లేక్ పేలస్ హోటల్‌లో రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ కార్యనిర్వాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తున్న హోటల్స్ రంగం ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ 12 శాతం ఉందని దాని భారం వినియోగదారుల మీద పడుతుందని... దానిని 5 శాతం వరకు తగ్గిస్తే... వ్యాపారులకు, వినియోగదారులకు వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడులో ఈ విధానం అమలు అవుతుందని, దీని వల్ల రూ.20లక్షల కోట్లు రాయితీలు వస్తాయని తెలియజేశారు. తద్వారా చిన్న వ్యాపారులు కూడా అభివృద్ధి చెందుతారని వివరించారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి కూడా అవకాశం వస్తుందని తెలిపారు. హోటల్స్‌ను రాత్రి 10 గంటలకు వరకు తెరవకుండా నిర్బంధిస్తున్నారని... దానివల్ల ప్రజలకు అవసరమైన విధంగా.. అలాగే ప్రయాణికులకు అందుబాటు లేకుండా ఉన్నాయని.. ఆ సమయాన్ని రాత్రి 12 గంటల వరకు పెంచాలని కోరారు. ఈ విషయమై పలుమార్లు ప్రభుత్వంతో చర్చలు చేశామని అయితే స్థానిక అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పోలీసులు చివరికి ఉన్నతాధికారులు సైతం వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు గరి శ్రీనివాసరావు మాట్లాడుతూ హోటల్స్‌పై అధికారులు దాడులు ఆపాలని ఫుడ్ శాంపిల్ సెంటర్స్ సంఖ్యను పెంచాలన్నారు. తనిఖీ విభాగాలకు శిక్షణా శిబిరాలు నిర్వహించాలని సూచించారు. అలాగే నూతన సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్గానిక్ ఫుడ్ కూడా అందించేందుకు వీలుంటుందన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రఘువీర్ శెనాయ్, జాయింట్ సెక్రటరీ గుడిశా శివకుమార్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

సాంప్రదాయ విజ్ఞాన దిశగా శిక్షణలు

- శాస్త్ర పరిజ్ఞాన విస్తరణ సాంప్రదాయ విజ్ఞానాన్ని సమగ్రపరచాలి
- గిరిజన యూనివర్సిటీలో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పీసీ జోషి



విజేతలైన విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పీసీ జోషిని సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: శాస్త్ర పరిశోధన పరిజ్ఞాన విస్తరణలో సాంప్రదాయ విజ్ఞానాన్ని సమగ్రపరచాలని ఆ దిశగా శిక్షణలు అందించాలని ఢిల్లీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ పీసీజోషి అన్నారు. స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 'విక్షిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికతలు' అనే అంశంపై బుధవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో సాంప్రదాయ విజ్ఞానంపై ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు శిక్షణ పొందాలని అన్నారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి మాట్లాడుతూ భారతీయ విజ్ఞాన వ్యవస్థ దేశ వ్యాప్తంగా విస్తరించాలని అన్నారు. ఈ అంశంపై డాక్యుమెంటరీ చేయడానికి సిద్ధం కావాలని అన్నారు. అందుకు అవసరమైన నిపుణులతో ఐకేఎస్‌పై చర్చా ధారావాహికంగా ప్రారంభిస్తుందని తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీదేవి మార్గదర్శకత్వంలో బయోటెక్నాలజీ విద్యార్థులు రూపొందించిన పూల గైడ్‌ను ఆవిష్కరించారు. సైన్స్ డేని పురస్కరించుకొని ఇటీవల యూనివర్సిటీలో నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలను ముఖ్యఅతిథి అందజేశారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ శరత్‌చంద్రబాబు, యూనివర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రివర్స్ టెండరింగ్‌తోనే ప్రజాధనం ఆదా



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, టిడ్కో చైర్మన్ జమ్మాన

బొబ్బిలి: టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు వారి అనుయాయులకు కట్టబెట్టిన భారీ కాంట్రాక్టులను వైఎస్సార్ సీపీ వచ్చిన తరువాత రివర్స్ టెండరింగ్ వేయడంతో భారీ ఎత్తున ప్రజాధనం ఆదా అయిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. రామన్నదొరవలసలో టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల విద్యుత్ సౌకర్యం కోసం రూ.3.71 కోట్లతో ఏర్పాటు చేసిన ఈపీడీసీఎల్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఛార్జ్ చేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎటువంటి ఏర్పాట్లు లేకుండా బడా కాంట్రాక్టర్లకు అప్పగించి లబ్ధిదారులకు గాలిలో నంబర్లు చూపారన్నారు. బొబ్బిలిలో చివరి దశకు వచ్చిన 1680 ఇళ్లను పూర్తి సౌకర్యాలు కల్పించి త్వరలోనే అప్పగిస్తామన్నారు. టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 89 ప్రాజెక్టులలో ఇప్పటికే 1.25లక్షల ఇళ్లను అప్పగించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టిడ్కో ఇళ్ల వద్ద రూ.451 కోట్లతో రెండు దఫాలుగా నిధులు వెచ్చించి సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నామన్నారు. జిల్లాలోని గుమడాం, సోనియానగర్, సాలూరు, బొబ్బిలి, సారిపల్లి ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు నాణ్యతతో సాగుతున్నాయన్నారు. ఇక్కడ నీటి లభ్యత ఇతర ప్రాంతాలతో పోల్చితే చాలా బాగుందన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, ఈపీడీసీఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఈఈ ఎ.అనంతరావు, కన్‌స్ట్రక్షన్స్ ఈఈ పి.త్రినాధరావు, డీఈఈ ఎం.శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళీ కృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి, స్థానిక కౌన్సిలర్ కొర్లాపు రామారావు, మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు టోకరా..

- గల్ఫ్ దేశాలకు పంపిస్తామని...
- ఒక్కొక్కరి నుంచి రూ.40 నుంచి రూ.60వేలకు పైగా వసూలు
- దందా అంతా ఆన్‌లైన్ ద్వారానే..
- రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు, కలెక్టరేట్‌లో అధికారులకు వినతి



కలెక్టరేట్ వద్ద తమకు వచ్చిన ఆఫర్ లెటర్స్‌ను చూపిస్తున్న నిరుద్యోగులు

విజయనగరం క్రైమ్: గల్ఫ్ దేశాలకు పంపిస్తామని వాట్సాప్‌లలో వచ్చిన మెసెజ్‌లకు, కరపత్రాలకు స్పందించిన కొంతమంది జిల్లాకు చెందిన నిరుద్యోగులతో పాటూ అధిక సంఖ్యలో ఒడిశాకు చెందిన వారు మోసపోయారు. దీనికి సంబంధించి బుధవారం రూరల్ పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ ఎస్ఐ ఆర్.వాసుదేవ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ముడిదాం సమీపంలో ఉన్న హోండా షోరూమ్ సమీపంలో స్మశానానికి ఆనుకుని ఒక పాతబడిన ఇల్లుఉంది. ఇంటి ఓనర్ ఓఎల్ఎక్స్‌లో అద్దెకు ఇస్తామని ప్రకటన ఇస్తే, దాని ప్రకారం ఆ యజమానికి ఫోన్ చేసి, ఆ ఇంటిని గుర్తు తెలియని వ్యక్తి అద్దెకు తీసుకున్నాడు. ఆన్‌లైన్ ద్వారానే ఇంటి అద్దె పేమెంట్ చేశాడు. అయితే లైఫ్ లైన్ ట్రావెల్ ఏజెన్సీ పేరుతో వాట్సాప్ ద్వారా గల్ఫ్‌లో పలు ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూలు చేస్తున్నట్లు ప్రకటించాడు. నిరుద్యోగులు ఆ కరపత్రాలను చూసి ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అనంతరం వారంతా వారి ఊళ్లకు వెళ్లిన తర్వాత వారికి చాటింగ్ ద్వారా ఆఫర్ లెటర్లు పంపించి, విమాన చార్జీలు తదితర వాటితో పాటూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నమ్మించి ఒక్కొక్కరి నుంచి రూ.40 నుంచి రూ.60వేల వరకూ వసూలు చేశాడు. ఆ తర్వాత రోజులు గడుస్తున్నప్పటికీ ఎటువంటి సమాచారం లేకపోవడంతో బాధితులు ఇంటర్వ్యూ జరిగిన ఇంటికి చేరుకున్నారు. అక్కడ తాళాలు వేసి ఉండడంతో తాము మోసపోయామన్న సంగతి వారికి అర్థమైంది. వెంటనే రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ఉన్నత అధికారులకు తమ పరిస్థితిని వివరించారు. సుమారు తొమ్మిది మంది జిల్లా కేంద్రం నుంచి ఫిర్యాదు చేశారు. రూ.5 లక్షలకు పైగా మోసపోయామని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఒడిశాకు చెందిన నిరుద్యోగులు 50 మందికి పైగా ఉండవచ్చని చెబుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయి విచారణ చేపట్టామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ ఆర్.వాసుదేవ్ తెలిపారు.

ఇండియన్ మెడికల్ అసోషియేషన్ బలపడాలి

- ఐఎంఈ రాష్ట్ర అధ్యక్షుడు డా.జయచంద్రనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఈ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్రనాయుడు

పార్వతీపురం: ఇండియన్ మెడికల్ అసోషియేషన్‌ను బలపరచాల్సిన అవసరం ఉందని ఇండియన్ మెడికల్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా.జయచంద్ర నాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం పార్వతీపురం మన్యం జిల్లాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు డాక్టర్లు, ప్రభుత్వ డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు సమస్యలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. డాక్టర్లు సమస్యలను రాష్ట్ర వ్యాప్తంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులకు ఎంఎల్‌సీ ఎలా కేటాయించారో, వైద్యులకు కూడా ఒక ఎంఎల్‌సీ కేటాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఆస్పత్రులను నిర్వహించాలంటే లైసెన్సులు, రిజిస్ట్రేషన్‌లు చేయాలని, ఈ లైసెన్సులన్నీ ఒకే సింగిల్ విండో విధానంలో అమలు చేస్తే ఎంతో వ్యయభారం, సమయభావం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా ఐఎంఈ అధ్యక్షుడు డా. యాళ్ల వివేక్, వై.పద్మజ, డా.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పట్టణాల్లో రైతు బజార్‌లు ఏర్పాటు

బొబ్బిలి: ఉత్తరాంధ్రలోని అన్ని పట్టణాల్లోనూ రైతు బజార్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని మార్కెటింగ్ శాఖ జేడీ పి.సుధాకర్ అన్నారు. బొబ్బిలి ఏఎంసీని బుధవారం సందర్శించిన ఆయన ఇక్కడి నుంచే రాష్ట్ర స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ తన పరిధిలో 61 కమిటీలున్నాయన్నారు. ఈ కమిటీల నుంచి రూ.163 కోట్ల పన్నుల వసూలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటి వరకూ రూ.109 కోట్లను వసూలు చేసినట్టు చెప్పారు. లక్ష్యాన్ని మార్చి నెలాఖరుకు చేరుకుంటామన్నారు. కమిషనర్ ఆదేశాల మేరకు రైతు బజార్ల కోసం స్థలాలు పరిశీలిస్తున్నట్టు చెప్పారు. ఈ ఫార్మింగ్ విధానం ఈ ప్రాంతంలో తక్కువగా ఉందని, వ్యాపార వాణిజ్య వర్గాలకు ఈ ఫార్మింగ్‌పై చైతన్యం కల్పిస్తామని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, ఏడీ బి.రవికిరణ్, కార్యదర్శి కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని క్షతగాత్రుడు

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట – సీతానగరం గ్రామాల మధ్య బుధవారం రాత్రి గుర్తు (45) తెలియని వ్యక్తి గాయాలపాలైన వైనమిది. 108 సిబ్బంది అందించిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో పాత రైల్వే గేట్ సమీపంలో గాయాల పాలైన వ్యక్తి ఉన్నట్లు సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం వచ్చింది. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న సమయానికే రైలు పట్టాలపై ఎడమ కాలు విరిగి మతితప్పి ఓ వ్యక్తి ఉన్నట్టు గుర్తించారు. దీంతో క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రిలో చేర్పినట్లు తెలిపారు. క్షతగాత్రుడి వివరాలు తెలియాల్సి ఉంది.

మాదలంగి పరిసరాల్లో గజరాజుల సంచారం

కొమరాడ: మండలంలోని మాదలంగి, వన్నాం గ్రామ పరిసరాల్లో గజరాజులు బుధవారం సంచరించాయి. చేతికందొచ్చిన జొన్న పంటలో సంచరిస్తుండడంతో నష్టం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. ఏనుగులు సంచరించే ప్రాంతానికి రైతులు రాత్రిపూట వెళ్లొద్దని అటవీశాఖ సిబ్బంది హెచ్చరికలు జారీ చేశారు.

మెటలర్జికల్ విద్యతో ఉద్యోగావకాశాలు అధికం



సావనీర్‌ను ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్ విద్యలో మెటలర్జికల్ కోర్సులతో అధిక ఆదాయంతో కూడిన ఉద్యోగావకాశాలు అధికంగా ఉంటాయని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. స్థానిక జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో మెటలర్జికల్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం 'ఐసెన్2కే24' సదస్సును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు జరుగుతున్న పరిశోధనా పరిజ్ఞానాన్ని పెంచుకుంటే మెటలర్జికల్ ఇంజినీరింగ్ విద్యతో ఉపాధి, ఉద్యోగాలు సులువుగా పొందవచ్చన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఆర్‌డీఓ హైదరాబాద్ సైంటిస్ట్–జీ డాక్టర్ ఎన్.కిషోర్‌నాథ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యతో పాటు ఆయా కోర్ సబ్జెక్ట్‌లపై నైపుణ్యాలను కళాశాల స్థాయి నుంచి విద్యార్థులు పెంచుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న టాటా స్టీల్ లిమిటెడ్ ప్రొడక్ట్ టెక్నాలజీ గ్రూప్ జోనల్ హెడ్ డాక్టర్ ఎం.సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సులకు విద్యార్థులు హాజరయి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని కోరారు. అనంతరం మెటలర్జికల్ విభాగం రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విభాగాధిపతి వి.మణికుమార్, ఫ్యాకల్టీ కో–ఆర్డినేటర్లు డాక్టర్ ఎ.శ్రీనివాసులు, బీఆర్ అంబేడ్కర్, స్టూడెంట్స్ కోఆర్డినేటర్లుగా ఎ.పవన్‌మాధవ్, కె.ముఖేష్, ఆర్.పూర్ణిమ వ్యవహరించారు.